క్లుప్తంగా

అన్న ప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శనివారం కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన జె.నిరంజన రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు రవికుమార్‌కు అందజేశారు. దాతకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశి సత్కరించారు.

ఆంజనేయస్వామికి పూజలు



ఆత్మకూరు: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ, ప్రత్యేక అలంకరణతోపాటు ఆకుపూజలు నిర్వహించారు. సిందూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహామంగళహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామివారి అలంకరణలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జగన్మోహన్

బండి ఆత్మకూరు: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని లింగాపురం గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే మొబైల్ నంబర్లకు స్పందించవద్దని, మొబైల్‌లో ఎలాంటి బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, వాటిని సోషల్ మీడియా ద్వారా ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ప్రలోభ పెట్టే యాప్‌లపై టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు.

సంతాపం

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆర్‌సీ విద్యాసంస్థల అధినేత పుల్యాల రాంచంద్రారెడ్డికి మృతికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సంతాపం ప్రకటించారు. శనివారం రామచంద్రారెడ్డి మృతదేహంపై ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద శనివారం హైదరాబాద్‌కు చెందిన అర్చన బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేశ పంచరత్నం, శివపంచాక్షరి, శివాష్టకం, శివతాండం, శివశివ శంకర, శివస్తుతి, దేవీస్తుతి, తదితర అష్టకాలకు, గీతాలకు అర్చన, మానస, ప్రణవి, ప్రవల్లిక, మహాలక్ష్మి, చరిత, చందన, వైష్ణవి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

చేగువేరాకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేగువేరా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్, నాయకులు చిన్న, వెంకట్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడిగినంత అన్నప్రసాదం!

- ఈనెల 12 నుంచే అమలుచేసిన అధికారులు



మహానందీశుని అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మహానంది: మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన భక్తులకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్, ఉన్నతాధికారులు శుభవార్త చెప్పారు. ఈనెల 9న మహానంది దేవస్థానంలో నెలకొన్న సమస్యలపై ‘సాక్షి’లో మహా సమస్యలు శీర్షికన అన్నమో మహానందీశా... అన్నప్రసాదాలు సరిపోక ఆకలితో అలమటిస్తున్న భక్తులు అంటూ ప్రచురించిన కథనంపై రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. అదే రోజు మహానంది ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన.. నిత్యాన్నప్రసాదం పంపిణీపై అధికారులు సమర్పించిన లెక్కలు సరిగా లేవని సమావేశంలోనే అసహనం వ్యక్తం చేశారు. భక్తులకు అన్‌లిమిటెడ్‌గా అన్నప్రసాదాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. దీంతో ఈనెల 12 నుంచే మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులందరికీ దేవస్థానం అధికారులు అన్న ప్రసాదాలు పంపిణీని ప్రారంభించారు.

మరుగుదొడ్ల టెండర్లు రద్దు చేయండి

మహానందిలో బాత్‌రూమ్‌లు లేక భక్తులు పడుతున్న అవస్థలపై ఇటీవల సోషల్‌మీడియాలో ఓ పోస్టు వైరల్ అయింది. దీంతో మంత్రితో పాటు కమిషనర్ రామచంద్రమోహన్ స్పందించారు. ప్రస్తుతం మహానంది దేవస్థానం పరిధిలో టెండర్లు ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న వాటిలో బీఎస్ఎన్ఎల్ వద్ద ఉన్న వాటికి రూ.9,40,000, జేఎస్‌డబ్ల్యూ వారు నిర్మించిన వాటిని ద్వారా రూ. 5,50,000తో ప్రైవేటు వారు నిర్వహిస్తున్నారు. దీంతో భక్తులు మరుగుదొడ్లకు వెళ్లాలంటే డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో టెండర్లను రద్దు చేసి టెండరుదారులకు మిగిలిన మొత్తం చెల్లించి దేవస్థానం ఆధ్వర్యంలోనే బాత్‌రూమ్‌లు, టాయిలెట్లను నిర్వహించాలని మంత్రి, కమిషనర్ ఆదేశించారని అధికారులు చెప్పారు.

సాక్షి ఎఫెక్ట్

మహానంది ఘటనలపై మంత్రి ఆగ్రహం

- టికెట్ల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశం
- రెండు టికెట్లే తేడా ఉన్నాయని తేల్చిన డీఈఓ



టికెట్ల కౌంటర్ల వద్ద విచారణ చేస్తున్న డీఈఓ మోహన్, ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి

మహానంది: మహానంది దేవస్థానంలో జరుగుతున్న వరుస ఘటనలపై రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వరుసగా పత్రికల్లో ఆలయంలో జరుగుతున్న అవకతవకలు, గోల్‌మాల్, దోపిడీ అంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విచారణకు ఆదేశించారు. ఇటీవల ఓ దిన పత్రికలో(సాక్షి కాదు) ఈనెల 10న మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన 60 మంది భక్తులు రూ.20 టికెట్లు కొనుగోలు చేయగా, సిబ్బంది కేవలం 20 మందికి మాత్రమే టికెట్లు ఇచ్చారని, వాటితోనే అందరూ దర్శనం చేసుకోవచ్చని వచ్చిన వార్తపై విచారణకు ఆదేశించడంతో శనివారం జిల్లా దేవదాయశాఖ అధికారి మోహన్, టెంపుల్స్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఆలయానికి చేరుకుని విచారణ చేశారు. ఏఈఓ ఎరమల మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేశారు. ఈ విషయంపై అధికారులు మాట్లాడుతూ అదే రోజు 60 మంది భక్తులు టికెట్లు కొనలేదన్నారు. ఆరుగురికి ఐదు టికెట్లు ఇచ్చారని, మరో ముగ్గురు వస్తే రెండు టికెట్లే ఇచ్చారన్నారు. దీంతో రెండు టికెట్లే వ్యత్యాసం ఉందన్నారు. ప్రవేశ మార్గం ద్వారా గుర్తించినా ఎలాంటి లోపం కనిపించలేదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని గ్రూపు ఆలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ‘సాక్షి’కి తెలిపారు.

మహానందిలో విజయవాడ డీఐజీ పూజలు



మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన డీఐజీ అమ్మిరెడ్డి, కుటుంబ సభ్యులు



వేపదారు శివలింగాన్ని దర్శించుకుంటున్న ఆర్డీఓ నాగజ్యోతి

మహానంది: మహానందిలో శనివారం రాత్రి విజయవాడ డీఐజీ అమ్మిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఆత్మకూరు ఆర్డీఓ

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి నాగజ్యోతి శనివారం సందర్శించారు. ఆమెకు ఆలయ పురోహితులు స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని వేపదారు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, మంగళహారతి పూజలు చేసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని పరివార దేవతలకు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. కృష్ణానది ప్రవాహాన్ని, తీరప్రాంతాన్ని పరిశీలించారు.

కమనీయం..మహానందీశుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు శనివారం కమనీయంగా సాగింది. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపంలో మహానందీశుడి దంపతులను కొలువు తీర్చి విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్యధారణ, అక్షతల సమర్పణ గావించారు. హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు కుటుంబ సభ్యులు కల్యాణోత్సవానికి దాతలుగా వ్యవహరించారు. కల్యాణం అనంతరం భక్తులకు మహానందీశ్వరస్వామి ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల భక్తులు స్వామివారి కల్యాణాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించారు.

‘సూపర్ సిక్స్’ అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎలాంటి షరతుల్లేకుండా అమలు చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇవ్వకుండా సీఎం చంద్రబాబు నాయుడు మొదటి ఏడాది మోసం చేశారన్నారు. రెండో ఏడాది కూడా రూ.5 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడేమో రూ.2 వేలు కట్ చేసి రూ.13 వేలు ఇవ్వడం దారుణమన్నారు. విద్యార్థులకు 75 హాజరు ఉండాలని, నాలుగు చక్రాల వాహనం ఉంటే అనర్హులని, 300 యూనిట్లు కరెంట్ బిల్లు వాడిన వారు సూపర్ సిక్స్ పథకాలకు దూరమంటూ షరతులు విధించడం తగదన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, రామకృష్ణ, రమణయ్య పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న దశ్యం

వెలుగోడు: మండలంలో పలు కేసుల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్ కలసి మద్యం బాటిళ్లను రోడ్డు రోలర్ చేత ధ్వంసం చేయించారు. వన్ ఆర్ తూము వెనుక భద్రపరిచిన మద్యం బాటిళ్లు, మండల వ్యాప్తంగా అక్రమ మద్యం రవాణాతో పాటు సారా తయారీ కేంద్రాలపై జరిపిన దాడుల సమయంలో పట్టుబడిన నాటుసారా ప్యాకెట్లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా, సారా తయారీలకు సంబంధించి డయల్ 100, 112లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఆలయ భూములకు వేలం



వేలంపాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని కడమల కాల్వ గ్రామానికి చెందిన పలు ఆలయాలకు చెందిన భూములను కౌలుకు బహిరంగ వేలం నిర్వహించామని గ్రూపు ఆలయాల కార్యనిర్వహణ అధికారి నాగప్రసాద్ తెలిపారు. శివ నందీశ్వర స్వామి ఆలయానికి చెందిన 23.28 ఎకరాలను రూ.5.20 లక్షలకు, చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 35.15 ఎకరాలను రూ.8.43 లక్షలకు, వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 4.04 ఎకరాలను రూ.1.66 లక్షలకు, భైరవ స్వామి ఆలయానికి చెందిన 10.70 ఎకరాలను రూ.4.06 లక్షలకు రైతులు దక్కించుకున్నారు. కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా గడివేముల మండల గ్రూపు ఆలయాల కార్యనిర్వహణ అధికారి రామలింగారెడ్డి, బండిఆత్మకూరు ఎస్‌ఐ జగన్మోహన్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు తప్పవు



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారురావు

నందికొట్కూరు: ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు తప్పవని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారురావు హెచ్చరించారు. శనివారం వినోద్ మిశ్రా భవనంలో జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజన ప్రాంతాల్లో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ అమాయక ఆదివాసీ ప్రజల ప్రాణాలను తీస్తోందన్నారు. గిరిజనులను టార్గెట్ చేసి హత్యలు చేస్తూ దుర్మార్గపు పాలన కొనసాగిస్తుందన్నారు. అడవులు, సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విమాన ప్రమాదానికి బాధ్యత వహించి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనపై దశల వారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు మాట్లాడుతూ బూటకపు ఎన్‌కౌంటర్లను కేంద్ర ప్రభుత్వం ఆపాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నాగార్జున, బీబీ, లక్ష్మిదేవి, మల్లేశ్వరమ్మ, రామకృష్ణ, భాస్కర్‌గౌడ్, సోమన్న, శివకుమార్, నరసింహ, సుధాకర్, ఏసన్న, సోమప్ప, శీలన్న పాల్గొన్నారు.

పొలానికి దారేది?

- అయ్యవారిపల్లె–మాధవరం రైతులకు రస్తా కష్టాలు

వెలుగోడు: పంట పొలాలకు వెళ్లాలంటే దారి కరువై రెండు గ్రామాల రైతులు అవస్థలు పడుతున్నారు. చేతికి వచ్చిన పంట ఇంటికి తెచ్చుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. రైతులు ఏళ్ల తరబడి ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదు. మండల పరిధిలోని అయ్యవారిపల్లె రైతుల అవస్థలు అంతా ఇంత కాదు. ఈ గ్రామంలో సుమారు 200 మంది ఓటర్లు, 300 జనాభా ఉంటుంది. ఈ గ్రామంలో అందరూ వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అలాగే మాధవరం గ్రామ పొలిమేర పొలాలు కూడా ఈ గ్రామానికి సమీపంలోనే ఉంటాయి. అయితే పొలాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడిన రస్తాలో పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. వర్షకాలంలో ఎక్కడ గుంత ఉందో అర్థం కాని పరిస్థితి. పంట దిగుబడులు ఇంటికి తెచ్చుకోవాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. పొలాలకు వెళ్లే రస్తాను నిర్మించాలని ఇటీవల రైతులు ఎమ్మెల్యేను కోరగా నిధులు మంజూరు చేయించి రస్తా సమస్య పరిష్కరిస్తానని హామీఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.

ఇళ్ల మధ్యే మురుగునీరు

గ్రామంలో డ్రైనేజీ లు లేకపోవడంతో ఇళ్ల మధ్యలోనే మురుగు నీరు నిల్వ ఉంటుంది. ఇటీవల స్థానికులే జేసీబీ ద్వారా తాత్కాలికంగా ఓ కాల్వ ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గాడితప్పిన పర్యవేక్షణ

- ఇష్టానుసారంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ





మధ్యాహ్నం 1.30 గంటలకే మూతపడిన 2, 4, 5 అంగన్‌వాడీ కేంద్రాలు



జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడటంతో కేంద్రాలను ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. జూపాడుబంగ్లాలో శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకే రెండు, నాలుగు, ఐదవ అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మధ్యాహ్నం 1.30 గంటలకే అంగన్‌వాడీ కేంద్రాలకు తాళం వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకటి, మూడవ కేంద్రాలు తెరిచి ఉంచినప్పటికీ మూడో కేంద్రంలో పిల్లల్లేరు. ఒకటో కేంద్రంలో 10 మంది పిల్లలున్నారు. కేంద్రాలకు తాళం వేసిని విషయాన్ని అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ నిర్మల దృష్టికి తీసుకెళ్లగా సెకండ్ సాటర్‌డే అయినప్పటికీ రోజూమాదిరిగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలను తెరిచి ఉంచాలని, అంగన్‌వాడీ వర్కర్లతో మాట్లాడి కేంద్రాలను తెరిపిస్తానని వివరణ ఇచ్చారు.

యోగాంధ్ర ఆలస్యంపై స్పెషల్ ఆఫీసర్ ఆగ్రహం

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కావడంపై మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ నిమిత్తం వచ్చిన ఆయన ఉదయం ఏడు గంటలైనా కార్యక్రమం ప్రారంభం కాకపోవడంతో అధికారులను మందలించారు. దీంతో అధికారులు హడావుడిగా అప్పటికప్పుడు స్థానికులను పిలిపించి కార్యక్రమం మొదలుపెట్టినట్లు స్థానికులు తెలిపారు.

అర్హులందరికీ ‘తల్లికి వందనం’ వర్తింపజేయాలి

ఆత్మకూరు: స్కీం వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామునాయక్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ అడ్డగోలు షరుతులతో కార్మికుల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందన్నారు. షరతులు లేకుండా పథకాన్ని ప్రతి విద్యార్థికి అందించాలన్నారు.

దెబ్బతిన్న కేసీ లైనింగ్

- ఆందోళనలో కేసీ రైతాంగం
- ప్రతిపాదనలు పంపామని చెబుతున్న నీటిపారుదల శాఖ అధికారులు



కొత్త ముచ్చుమర్రి–పగిడ్యాల మధ్య ధ్వంసమైన కేసీ కాలువ




పగిడ్యాల- పడమర ప్రాతకోట గ్రామాల మధ్య పగుళ్లు బారి ధ్వంసమైన కాలువ లైనింగ్

పగిడ్యాల: కర్నూలు–కడప రైతాంగానికి వరప్రదాయిని అయిన కేసీ కాలువ సిమెంట్ లైనింగ్ పగుళ్లు బారి దెబ్బతినింది. బ్రిటీష్ హయాంలో నిర్మితమైన ఈ కేసీ కాలువను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పాలన సాగించిన స్వర్గీయ కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి హయాంలో జపాన్ నిధుల సాయంతో ఆధునీకరించారు. అప్పట్లో పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు కాంట్రాక్టు దక్కించుకుని పనులు ముగించారు. అయితే కాలువ లైనింగ్ ప్రస్తుతం అడుగడుగునా దెబ్బతిని సిమెంట్ బెడ్ ధ్వంసమైంది. దెబ్బతిన్న ప్రాంతంలో మట్టి కొట్టుకుపోయి కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున తుంగభద్ర జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుకుంటోంది. ఈ ఏడాది వరి నాట్లు ముందస్తుగానే నాటుకునే అవకాశం ఉందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. కేసీ కాలువకు సాగు, తాగునీటిని విడుదల చేయక ముందే దెబ్బతిన్న సిమెంట్ లైనింగ్ బెడ్ పనులను సత్వరమే చేపట్టి కేసీ కాలువ ఉనికిని కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ నందికొట్కూరు సెక్షన్ ఏఈఈ వీరమ్మను వివరణ కోరగా దెబ్బతిన్న మాట వాస్తవమని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న దశ్యం



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

వెలుగోడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ అన్నారు. పట్టణంలోని 5వ సచివాలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసి, యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈనెల 21న ప్రధాని నరేంద్రమోదీ విశాఖ రానున్నారని, యోగాంధ్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ బ్రహ్మంనాయక్, సర్పంచ్ వేల్పుల జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

- **కొత్తపల్లి:** యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి తెలిపారు. శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేయించారు. యోగా జీవితంలో ఒక భాగం కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మీదేవి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి రోజు యోగాకు సమయం కేటాయించాలి

పాములపాడు: ప్రతి ఒక్కరూ ప్రతి రోజు యోగా చేస్తూ ఇతరుల చేత చేయించాలని మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. శనివారం ఏపీ మోడల్ స్కూల్ ఆవరణంలో యోగా డెమో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ, ఏఓ గాయత్రీ, ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీఓ అలివేలిమంగమ్మ, మాస్టర్ ట్రైనర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి

బండి ఆత్మకూరు: ఒత్తిడిని అధిగమించడం కోసం ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రెహ్మాన్, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ ఎం.దస్తగిరి సూచించారు. శనివారం యోగా గురువు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న వారు పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి అక్బర్, వీఆర్‌ఓలు ఏసుపాదం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

జూపాడుబంగ్లా: యోగాతో ఒత్తిడి దూరమవుతుందని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మోడల్‌స్కూల్‌లో సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న పాల్గొన్నారు.